# లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు

- రవీంద్రభారతిలో అందించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్,మార్చి11 :

జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న బుధవారం నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.




## స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డాక్టర్ల అర్హతలు, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం (1994) అమలుతో పాటు, అనుమతులు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధితమని, ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధించబడుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట రమణ హెచ్చరిం చారు. కేంద్రాల్లో నిబంధనల ప్రకారం బోర్డులు ప్రదర్శించడాన్ని కూడా పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి పంపిస్తున్న తీరును పరిశీలించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీఎంహెచ్ఓ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణతో పాటు పి.ఓ. డి.టి.టి. డాక్టర్ ఉమాశ్రీ,, పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సనా జవేరియా, సఖి కన్సల్టెంట్ డి. లక్ష్మి, డాటా ఎంట్రీ ఆఫరేటర్ కె. రమేశ్, డెమో రాజగోపాల్, ఎ.ఎస్.ఐ విజయమాణి, ఎన్.జి.ఓ. సభ్యులు సిస్టర్ సిరెల్, సూపర్ వైజర్లు సయ్యద్ సబీర్, ఎజాజ్ పాల్గొన్నారు.



# జిల్లా ఆసుపత్రిలో బెడ్ షీట్ల కొరతా..!





- అసలు ఉన్నాయా..? దాచేశారా...?
- హెడ్ నర్స్ లు ఎక్కడ..?
- సూపరింటెండెంట్ మౌనం ఎందుకు..?



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుభ్రతపై పెద్ద సందేహాలు నెలకొన్నాయి. ఆసుపత్రిలో రోగులకు సరఫరా చేయాల్సిన బెడ్ షీట్లు సరిగా లేవని, రోగులు తమ వెంట బెడ్ షీట్లు తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపణలు పెద్ద మొత్తంలో వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు బెడ్ షీట్లు లేని బెడ్ పైనే సేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది.

**హెడ్ నర్స్ లు ఎక్కడ..? సూపరింటెండెంట్ మౌనం ఎందుకు..?**

వార్డుల పర్యవేక్షణ బాధ్యతలో ఉన్న హెడ్ నర్స్‌లు ఏమైపోయారు..? వార్డుల్లో బెడ్ షీట్ల గురించి పట్టించుకునే వారే లేరా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు బెడ్ షీట్లు ఉన్నాయా..! అనే అనుమానాలు ఓ వైపు వ్యక్తమవుతుంటే.., మరోవైపు మాయమై ఉంటాయనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించకపోవడంతో పర్యవేక్షణలో తీవ్ర లోపం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఏదీ ఏమైనా అధికారుల నిద్ర మత్తు వీడి ఆసుపత్రి పర్యవేక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జిల్లా ఉన్నతాధికారుల జోక్యం అవసరం**

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పరిస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరముందని వైద్యం పొందుతున్న రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. రోగుల కష్టాలు గమనించి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు. పర్యవేక్షణ లోపాలను సరిదిద్దుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు మెలకువ తెచ్చుకుం టారా..? చూడాలి..!

ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రా రెడ్డిని వివరణ కోరగా దోబీకి 100 బెడ్ షీట్లు ఇస్తే తిరిగి 20 మాత్రమే ఇస్తున్నాడు. కాంట్రాక్టు లేకుండా మనదే బాధ్యత ఉంటే ఈ సమస్య ఉండేది కాదు. అన్ని సమస్యలకు వెంటనే స్పందిస్తున్నాం. బెడ్ షీట్లపై కూడా దృష్టి పెట్టి సమస్యను పరిష్కరిస్తా.

# బెల్లంపల్లిలో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య సమక్షంలో రూ. 200 కోట్ల నిధులతో బెల్లంపల్లి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ల చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరి బాబు, మాజీ మున్సిపల్ అధ్యక్షురాలు జక్కుల శ్వేత, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామిలతోపాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ , అనుబంధ సంఘాల నాయకులు, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముందు ఆందోళనలు, ధర్నాలు నిషేధం

**హైదరాబాద్,మార్చి11 :** శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులు అసెంబ్లీ ఆవరణలో ఎలాంటి ఆందోళనలు, నిరసనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి,ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు సభ లోపల, వెలుపల శాంతియుత వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభకు సకాలంలో చేరుకొనేలా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బ్జడెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని, గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ముద్రించాలని అధికారులకు సూచించారు. శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## డీలిమిటేషన్‌తో సీట్లు పెరుగుతాయి

- తగ్గడం అన్నది పసలేని వాదన
- స్టాలిన్ వ్యాఖ్యల నేపథ్యంలో రాజ్‌నాథ్ వివరణ

**న్యూఢిల్లీ,మార్చి11 :** నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆరోపణలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోసి పుచ్చారు. పార్లమెంటు సీట్ల సంఖ్య తగ్గుతుందని జరుగుతున్న చర్చపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. డీలిమిటేషన్‌తో తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన అన్నారు.ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ, డీలిమిటేషన్ పక్రియ ప్రణాళికా బద్ధంగా కొనసాగుతుందని తాను భావిస్తున్నట్టు చెప్పారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు ఏదైనా అభ్యంతరం ఉంటే వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఆయనకు ఉంటుందని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారని, నిర్ణయం న్యాయంగానే ఉంటుందని చెప్పారు. ఞా సన సభ అయినా, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుం దని అన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాట క, కేరళలో కూడా సీట్లు పెరుగుతాయని, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలు మాత్రమే ప్రయోజనం పొందుతాయనడం సరైన వాదన కాదని రాజ్‌నాథ్ చెప్పారు.

# బొగ్గు, క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో సింగరేణి



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

దేశంలో బొగ్గు, ఖనిజ వనరుల అన్వేషణ, మైనింగ్ విస్తరణ కోసం ప్రభుత్వ రంగ సంస్థలు సింగరేణి కాలరీస్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరస్పర సహకారానికి ముందుకు వచ్చాయి. బొగ్గు రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి, దేశానికి అవసరమైన క్రిటికల్ మినరల్స్ మైనింగ్ లో అడుగు పెట్టేందుకు సంకల్పించిందని, ఈ దిశగా NMDCతో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ వెల్లడించారు. ఎన్నెం డీ సీ తో ప్రత్యేక సమావేశం మంగళవారం సాయంత్రం, సింగరేణి డైరెక్టర్లు, ఉన్నతాధికారులు సీఎండీ అమితావ ముఖర్జీ, ఆ సంస్థ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో అపార అనుభవం ఉన్న సహకారం తమ సంస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సింగరేణి సీఎండీ బలరామ్ అభిప్రాయపడ్డారు. ఈ క్రిటికల్ మినరల్స్ అన్వేషణకు ఐఐటీ - హైదరాబాద్ తో ఒప్పందం కుదుర్చుకున్నామని, సింగరేణి సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఈ రంగంలో ముందుకు వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమావేశంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి విధానం, మైనింగ్ సాంకేతికత, మానవ వనరుల నైపుణ్యం గురించి ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు.

**ఎన్ఎండీసీ సహకారంతో మైనింగ్ విస్తరణ..**

ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ మాట్లాడుతూ.. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి ముఖ్య భూమిక పోషిస్తోందని, ఖనిజ వనరుల వినియోగంలో ఎన్ఎండీసీ దశాబ్దాలుగా దేశానికి సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రాజెక్టుల్లో సింగరేణితో కలిసి పని చేసే అవకాశాలను పరిశీలిస్తామని, జార్ఖండ్‌లో ఎన్ఎండీసీ కి దక్కిన బొగ్గు బ్లాక్‌లో సింగరేణి సహాయాన్ని తీసుకునే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని అన్నారు. భవిష్యత్తులో పరస్పర సహకారంతో మైనింగ్ రంగంలో మరింత పురోగతి సాధించాలని రెండు సంస్థలు సంకల్పించాయి. ఈ సమావేశంలో ఎన్ఎండీసీ డైరెక్టర్లు విశ్వనాథ సురేశ్ (కమర్షియల్), వినయ్ కుమార్ (టెక్నికల్), జయ్ దీప్ దాస్ గుప్తా (ప్రొడక్షన్), ప్రియదర్శిణి గడ్డం (పర్సనల్) తదితరులు పాల్గొన్నారు. సింగరేణి తరపున డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (పీ అండ్ పీ), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్‌డీ ఎం సుభానీ, జీఎం (ఫైనాన్స్) సుబ్బారావు తదితరులు హాజరయ్యారు.





# అర్ధరాత్రి రామగుండం పోలీస్ కమిషనర్ తనిఖీ

**శెనార్తి మీడియా, గోదావరిఖని/మంచిర్యాల**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం అర్ధరాత్రి సమయంలో రామగుండం రైల్వే స్టేషన్, గోదావరి ఖని బస్ స్టాండ్, రామగుండం పోలీస్ స్టేషన్, పలుప్రాంతాల్లో పర్యటించారు. రామగుండం పోలీస్ కమీషనర్ గా బాధ్యత లు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా అర్ధరాత్రి వేళగోదావరి ఖని, రామగుండం ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉంటుంది, పోలీసుల పెట్రోలింగ్, గస్తీ పరిస్థితి ఏ విధంగా ఉందని ప్రత్యక్షంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లలో ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం రామగుండం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనిఖీ చేశారు. జీడీ బుక్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వివరాలు, విధులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి డ్యూటీ వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు .



